ఆత్మీయ సమ్మేళనాల సందడి

- బీఆర్ఎస్ నేతృత్వాన ఇంటింటి ప్రచారం
- పంచాయతీల వారీగా అభివృద్ధిపై కరపత్రాలు
- సత్తుపల్లి నియోజకవర్గంలో 16 ఆత్మీయ సమ్మేళనాలకు కసరత్తు
- నేడు మొదటగా సత్తుపల్లి రూరల్ సమావేశం


అడసర్లపాడులో ఆత్మీయ ఆహ్వాన పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: ఆత్మీయ సమ్మేళనాలతో అధికార బీఆర్ఎస్‌లో రాజకీయ సందడి మొదలైంది. ఎనిమిదేళ్లుగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే కాక.. ఎన్నికలకు పార్టీ శ్రేణులకు సిద్ధం చేసేలా ఈ సమ్మేళనాలను నిర్వహిస్తున్నారు. ఇదేసమయాన ప్రతిపక్షాలు చేసే విమర్శలను దీటుగా తిప్పికొట్టేందుకు సిద్ధం చేయనున్నారు. ఈమేరకు సత్తుపల్లి నియోజకవర్గంలో 16సమాశాలు నిర్వహించనుండగా.. తొలిసమావేశంలో ఆదివారం సత్తుపల్లి రూరల్ మండలానికి సంబంధించి జరగనుంది. కాగా, ఆత్మీయ సమ్మేళనాలను హాజరు కావాల్సిందిగా పార్టీ శ్రేణులను ఆహ్వానించడమే కాక ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో వివరాలతో పంచాయతీల వారీగా కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యాన సత్తుపల్లి మండలం బేతుపల్లి, వేంసూరు మండలం అడసర్లపాడులో శనివారం ఇంటింటికి తిరిగి ఆత్మీయ సమ్మేళన ఆహ్వానాలను అందించారు.

పంచాయతీల వారీగా అభివృద్ధి..

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పంచాయతీల వారీగా ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను కరపత్రాల రూపంలో ఇంటింటికి పంచుతున్నారు. ఏ పంచాయతీకి ఎన్ని పెన్షన్లు వచ్చాయి. కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్, రైతుబంధు పథకాలు, నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి నిధులు, గ్రామాలలో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, అంతర్గత బీటీరోడ్ల నిర్మాణం, రైతువేదికలు, ప్రకృతివనాలు, వైకుంఠదామాల నిర్మాణాలకు ఎంతెంత నిధులు వెచ్చించారో వివరాలను పొందుపరుస్తున్నారు.

16 సమ్మేళనాలు..

సత్తుపల్లి మండలం గంగారం వాసు గార్డెన్స్‌లో ఆదివారం తొలి ఆత్మీయ సమ్మేళనం జరగనుంది. అలాగే, సోమవారం వేంసూరు మండలం బీరాపల్లి, ఈనెల 6న పెనుబల్లి, 8న కల్లూరు, 10న తల్లాడ, 12న సత్తుపల్లి పట్టణంలో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటుచేశారు. సత్తుపల్లి మండలంలో రెండు, పట్టణంలో రెండు, వేంసూరులో రెండు, పెనుబల్లిలో మూడు, కల్లూరులో నాలుగు, తల్లాడలో మూడుచొప్పున నియోజకవర్గ వ్యాప్తం 16 ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించారు. కాగా, ఆత్మీయ సమ్మేళనాలకు వచ్చే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల కుటుంబ సభ్యులకు ఘుమఘుమలాడే వంటకాలను వడ్డించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాక ప్రచారంలో భాగంగా పెద్ద ఎత్తున హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక వేంసూరు మండలం అడసర్లపాడులో శనివారం ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకావాలని కరపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలతతో పాటు దొడ్డ శ్రీలక్ష్మి, వెంకటకృష్ణారెడ్డి, దొడ్డ చెన్నకేశవరెడ్డి, గాదె శ్రీనివాసరావు, గొర్ల నివాసరెడ్డి, మందపాటి సత్యనారాయణరెడ్డి, మందపాటి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వెంకటవీరయ్యకు బొట్టుపెట్టి ఆహ్వానం పలుకుతున్న మహిళలు

క్లుప్తంగా

ఆర్టీసీ సేవలను వినియోగించుకోండి

వైరారూరల్: ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం తెలిపారు. మండలంలోని రెబ్బవరం గ్రామంలో శనివారం ప్రజల వద్దకే ఆర్టీసీ కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం గొల్లెనపాడులో దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించి సుమారు 20 మందికి 50 శాతం రాయితీతో కూడిన బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు సాదం రామారావు, కంచర్ల మరియమ్మ, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు పంపిణీ..


తల్లాడ: దివ్యాంగులకు బస్‌పాస్ అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తల్లాడ: తల్లాడలో స్థానిక రైతు వేదికలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 150 మంది దివ్యాంగులకు ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు చేతుల మీదుగా శనివారం బస్‌పాస్‌లను అందించారు. కార్యక్రమంలో వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, ఎంపీటీసీ తిరుమలాదేవి, ఆత్మ డైరెక్టర్ చలపతిరావు, జోన్ చైర్మన్లు శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, జీవీఆర్, శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, ఉదయ్, రఘు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు..

వైరా: విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ అన్నారు. శనివారం ఆ సంఘ నాయకులు వైరాలో సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు భయపడి ఆత్మహత్యలకు పాల్పడొద్దన్నారు. గురుకులంలో ఘర్షణలు పడడం సరికాదన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఆర్‌సీఓ, జిల్లా కలెక్టర్‌లు పాఠశాలను సందర్శించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దీపిక, కిరణ్, శివ, సాయి పాల్గొన్నారు.

కరాటే బెల్టులు ప్రదానం


బెల్టులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

వైరా: వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్స్ పాఠశాలలో కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కరస్పాండెంట్ పి.భూమేశ్వరరావు డైరెక్టర్ కుర్రా సుమన్‌లు ఆరెంజ్, గ్రీన్ బెల్టులు ప్రదానం చేశారు. పాఠశాల విద్యార్థులు గణేష్, చరణ్, అమృత, ప్రవస్థి, నాగేందర్, వర్షిత, సాయి జక్షితలు మంచి ప్రతిభ కనబర్చి బెల్టులు సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ భూమేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మరక్షణకు కరాటే వంటి విద్యలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ షాజీ మాథ్యు, ఏఓ నరసింహారావు, కరాటే మాస్టర్ మహబూబ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తల్లాడ: మండలంలోని ముద్దునూరు గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త రంగాపురం, పాత రంగాపురం గ్రామాల్లో సీసీ రోడ్లకు తల్లాడ జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, గ్రామ సర్పంచ్ రేణుక శనివారం శంకుస్థాపన చేశారు. ఉపాధిహామీ పథకం నిధులతో సీసీ రోడ్లను నిర్మించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జోన్ చైర్మన్ దాసురావు, ఎంపీటీసీ పద్మ, లక్ష్మీ, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామంలో శనివారం ఈజీఎస్‌కి చెందిన రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు స్థానిక సర్పంచ్ శీలం జయలక్ష్మి శంకుస్థాపన చేశారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కృషితో నిధులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, మాజీ సర్పంచ్ బహదూర్, నాయకులు శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు, రామారావు, వెంకటేశ్వరరావు, మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

ముదిగొండ: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసల్దార్ శిరీష తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేపడుతూ పట్టుబడే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి రెవెన్యూ సిబ్బందితో గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లకు జరిమాన విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

మొక్కజొన్న పంట నష్టంపై సర్వే


ముదిగొండ: పెద్దమండవలో సర్వే చేస్తున్న అధికారులు

చింతకాని/ముదిగొండ: ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను వ్యవసాయ విస్తర్ణాధికారులు శనివారం సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతులతో మాట్లాడి పంటనష్టం వివరాలను తెలుసుకున్నారు. మొక్కజొన్న పంట దెబ్బతిన్న ప్రతీ రైతుకు ఎకరానికి ప్రభుత్వం రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాలల్లో మార్కెటింగ్ జిల్లా అధికారి నాగరాజు, ఏడీఏ వాణిశ్రీ, ముదిగొండ, ఖమ్మం రూరల్ ఏఓలు రాధ, సరిత, నాగేశ్వరరావు, ఏఈఓలు, ముదిగిండ ఏఓ పల్లెల నాగయ్య, గ్రామసర్పంచ్‌లు, వ్యవసాయ విస్తర్ణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ కవిత, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

ఎర్రుపాలెం/ఏన్కూరు: కురిసిన అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ శీలం కవిత, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు నూతక్కి నర్సింహారావు, బీజేపీ మండల అధ్యక్షుడు ముక్కపాటి శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నారయణపురం, చొప్పకట్లపాలెం, రాజులదేవరపాడు గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను వారు రైతులతో కలిసి పరిశీలించారు. వీరితో పాటుగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డిలు, పరిశీలించారు. పంట నష్టాన్ని సర్వే చేయాలని తహసీల్దార్ తిరుమలాచారి, మండల వ్యవసాయాధికారి కె.విజయభాస్కరరెడ్డికి వినతిపత్రాలు అందించారు. ఏన్కూరు మండలంలోని కేసుపల్లి, తూతకలింగన్నపేటలో వర్షాలతో దెబ్బతిన్న పంటలను కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్, ఖమ్మం కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వరావులు పరిశీలించారు. ఈ కార్యక్రమాలల్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గం నాయకులు శీలం వెంకట్రామిరెడ్డి, గూడూరు రమణారెడ్డి, బుర్రా వెంకటనారాయణ, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి పుప్పాళ్ళ చంద్రమౌళేశ్వరరావు, మండల అధ్యక్షుడు మిర్యాల నాగేశ్వరరావు, నాయకులు దేవరకొండ కోటేశ్వరరావు, మిర్యాల వెంకటేశ్వరరావు, మల్లెల మోహన్‌రావు, కన్నా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్లపై విచారణ జరపాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మధిర: నియోజకవర్గంలో దళితబంధు యూనిట్లపై విచారణ జరపాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలుచోట్ల దళితుబందు యూనిట్లను పరిశీలిస్తే బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల కమిషన్ల కోసమే ఇచ్చినట్టుగా ఉందని ఆరోపించారు. యూనిట్ కావాలంటే అర్హులు ఆయా పార్టీ నేతలకు డబ్బులు ఇవ్వాల్సి వస్తుందన్న ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు యూనిట్ల మంజూరులో ప్రజాప్రతినిధులు, అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ, మండల అధ్యక్షులు పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డితో పాటు కాసిన నాగభూషణం, కొప్పురావూరి రామయోగేశ్వరరావు, కుక్కల రాము, పెరుమాళ్లపల్లి మోహన్‌రావు, మాదిరాజు సాయిరాం, రామకృష్ణ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


సత్తుపల్లిరూరల్: ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రామాదేవి, టీచర్లు

వేంసూరు/సత్తుపల్లిరూరల్/తల్లాడ/బోనకల్: పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యం దరి చేరుతుందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సీడీపీఓ కృష్ణకుమారి తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా శనివారం వేంసూరు మండలంలోని అడసర్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో, సత్తుపల్లిలోని రుద్రాక్షపల్లి సెక్టార్‌లో, బోనకల్ ముష్టికుంట్ల గ్రామంలో, తల్లాడ తెలగవరం గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల పోషణ వంటకాలు, చిరుధాన్యాలు ప్రదర్శించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలత, వైస్ ఎంపీపీ దొడ్డ శ్రీలక్ష్మీ వెంకటకృష్ణరెడ్డి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి, శైలజ, నిర్మల, అనితారాజ్యం, పద్మ, ఆశావర్కర్ రమాదేవి, సర్పంచ్ టి.కృష్ణయ్య, ఉపాధ్యాయులు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయాలి

చింతకాని: ప్రజా సమస్యల పరిష్కారానికై ఈ నెల 14 నుంచి 21 వరకు జరిగే సీపీఐ ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం పార్టీ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ హటావో–దేశ్‌కి బచావో అనే నినాదంతో లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ, ధరల తగ్గింపు పరిష్కారం కోరుతూ ఇంటింటి సీపీఐ కార్యక్రమంతో ప్రజల్ని చైతన్యం చేయ నున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మల్లికార్జున్‌రావు, జిల్లా సమితి సభ్యులు ఏసు, గోపాలరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగులవంచకు అంతిమయాత్ర వాహనం, ఫ్రీజర్ వితరణ

చింతకాని: మండలంలోని నాగులవంచకు అంతిమయాత్ర వాహనం, మృతదేహాన్ని భద్రపరిచేందుకు ఫ్రీజర్ అందజేయనున్నట్లు ఖమ్మానికి చెందిన వీవీసీ మోటార్స్ అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. గ్రామంలోని వంకాయలపాటి రామయ్య ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఆయన తన తల్లి వంకాయలపాటి ద్రౌపదితో కలిసి మాట్లాడారు. గ్రామంలో 15 అత్యంత ఆధునాతన సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌ను గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్ ఆలస్యం నాగమణి, ఎస్సై పాదిల వెంకన్నతో పాటు అంబటి వెంకటేశ్వర్లు, బసవయ్య, వెంకటేశ్వరరావు, చిన్న అప్పారావు, నెల్లూరి రమేష్, గోపి, శ్రీరాములు, పుల్లయ్య, మంగయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, జయ, రామ్మూర్తి, కాశయ్య పాల్గొన్నారు.

రాధాకృష్ణమూర్తికి పలువురు నివాళి

వైరా: వైరాలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన చావా రాధాకృష్ణమూర్తి మృతికి పలువురు సంతాపం ప్రకటించారు. వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ సీతారాములు, 14వ వార్డు కౌన్సిలర్ కోటయ్య, బీఆర్ఎస్ నాయకులు మద్దెల రవి, కట్టా కృష్ణార్జునరావు, మోహన్‌రావు, సురేష్, శ్రీధర్, హన్మంతరావు, బీబా సాహెబ్ తదితరులు రాధాకృష్ణమూర్తి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు

చింతల రాంబాబుకు..

కొణిజర్ల: మండలానికి చెందిన టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల రాంబాబు దశదిన కర్మను శనివారం కొణిజర్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు తాతా సుధాకర్‌రావు, వెంకటేశ్వరరావు, నాయకులు మల్లయ్య, వెంకన్న, ఆంజనేయులు, నరసయ్య, పుల్లయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, మల్లయ్య తదితరులు రాంబాబు చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు.

నానునగర్ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

కారేపల్లి: ఇటీవల రోడ్డుప్రమాదానికి గురైన మండలంలోని నానునగర్‌తండా గ్రామ సర్పంచ్ మాళోత్ రాంజీని వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ శనివారం పరామర్శించారు. సర్పంచ్ రాంజీ రోడ్డు ప్రమాదానికి గురై ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా... సమాచారం అందుకున్న వైరా ఎమ్మెల్యే సర్పంచ్ రాంజీని సందర్శించి, పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉమాశంకర్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఉన్నారు.

ఈదురు గాలులకు ఇంటిపై పడిన చెట్టు

సత్తుపల్లిటౌన్: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులు, వర్షానికి రేజర్ల, పట్టణంలో వెంగళరావునగర్ కాలనీల్లో మూడు ఇళ్లపై చెట్లు పడగా ధ్వంసమయ్యాయి. వెంగళరావునగర్ కాలనీకి చెందిన తగరం మరియమ్మ రేకుల ఇంటిపై వేపచెట్టు కూలడంతో ఇల్లు ధ్వంసం కావడమే కాక టీవీ, గృహ ఉపకరణాలు దెబ్బతిన్నాయి. అలాగే, బేతుపల్లి వద్ద జాతీయ రహదారిపై చెట్టు విరిగిపడడంతో గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

బీజేపీలో పన్నా ప్రముఖ్‌లే కీలకం..

కల్లూరురూరల్: వివిధ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడానికి అక్కడి బూత్‌స్థాయి కమిటీలు పన్నా ప్రముఖ్‌లదే ముఖ్యభూమిక అని, అదే విధానాన్ని తెలంగాణలోనూ అమలుకు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిర్ణయించారని ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ సంబూరి రామలింగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు మండలంలోని చిన్నకోరుకొండిలో శనివారం ఆయన పన్నా ప్రముఖ్ కమిటీలను ఏర్పాటు చేశాక మాట్లాడారు. బూత్ స్థాయిలో పని విభజన చేస్తూ కేంద్ర పథకాలను ప్రజలకు వివరించేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. నాయకులు నాగేశ్వరరావు, కృష్ణమోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను అరికట్టాలి

ముదిగొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్టు షాపులు అరికట్టాలని కోరుతూ ముదిగొండ బస్టాండ్ సెంటర్‌లో శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన, రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

కారేపల్లి: కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారినికై ఈ నెల 5న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, అఖిలభారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మాధారం గ్రామంలో శనివారం మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.నరేందర్, రవి, నరసింహారావు, యాకయ్య, సక్రు, ఉపేందర్, సంజీవరావు, మధు, కిషన్, వెంకన్న, యాతగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా అవగాహన సదస్సు

కల్లూరు: కల్లూరు ఐకేపీ కార్యాలయంలో శనివారం మహిళా సంఘాల సభ్యులకు మహిళా ఆరోగ్యం ఇంటింటి సౌభాగ్యం పేరుతో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరోగ్య మహిళాపై అవగాహన కల్పించారు. చెన్నూరు ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు ఇస్రాత్ తబసుము రొమ్ము కేన్సర్, కుటుంబ నియంత్రణ, రుతుస్రావ సమస్యలు, శరీర బరువు, సూక్ష్మ పోషకలోపాల గురించి, కేన్సర్ స్క్రీనింగ్, మూత్రనాల ఇన్ఫెక్షన్లు, సుఖ వ్యాధులు, మోనో పాస్ నిర్వాహణ వైద్య సేవల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బానోత్ దరగయ్య, ఏపీఎం వెంకట్రామారావు, సీసీలు వెంకటేశ్వర్లు, వెంకయ్య, సీహెచ్ శ్యామలాదేవి, రాజ్యలక్ష్మి, వెంకట్రావమ్మ, రాధా రుక్మిణి, ఎస్తేరు ఆనందకుమారి, అపర్ణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద కార్పొరేట్ విధానాలపై పోరాటం

కారేపల్లి: మతోన్మాద కార్పొరేట్ విధానాలపై పోరాటమే అమరులకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మెరుగు సత్యనారాయణ అన్నారు. శనివారం కారేపల్లి మండలం చీమలపాడు గ్రామంలో పోడుభూముల పోరాటయోధుడు సీపీఎం సీనియర్ నాయకుడు ఆరాచక శక్తుల చేతిలో హత్యగావించబడిన మాళోత్ నాను 45వ వర్ధంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలపై ప్రజలు విసుగు చెందారని, రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రవి, నాయకులు బ్రహ్మయ్య, నాగయ్య, రవి, కొండలరావు, సర్వయ్య, వీరస్వామి, కిషన్, హనుమా, శోభన్, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో 'మిస్ట్' విద్యార్థుల ప్రతిభ


8.80 ఎస్‌జీపీఏ సాధించిన అఖిల

సత్తుపల్లిరూరల్: బీటెక్ చివరి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో సత్తుపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల(మిస్ట్) విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ సీహెచ్.హరికృష్ణ తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్‌లో బండి అఖిల 8.80, షేక్ వసీమ్ 8.42, ఈఈఈలో కొండా సంధ్య 8.76, కాసి పవన్‌కుమార్ 8.61, మెకానికల్ ఇంజనీరింగ్‌లో భూక్యా శ్రీధర్ 8.61, సయ్యద్ సుభానీ 8.42, ఈసీఈలో కలేటి కేజియా 8.85, చిలుకూరి నిఖిత 8.71, సీఎస్సీలో కొంగర లిఖితాచౌదరి 8.33, గాదే మాధవి 8.14, మైనింగ్ ఇంజనీరింగ్‌లో కంచు నర్సింహారావు 8.90, నరుకుళ్ల రాధాకృష్ణ 8.76 ఎస్‌జీపీఏ సాధించారని పేర్కొన్నారు.ఆ యా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, అధ్యాపకులు అభినందించారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


మధిర: పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రభాకర్

ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్న పది వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా శనివారం మండలాల విద్యాశాఖాధికారులు తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమిస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీరు, వైద్యం, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్ వసతి కల్పించినట్లు చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ గది సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంటుందన్నారు. విద్యార్థులు 45 నిమిషాలు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఎటువంటి ఒత్తిడి కి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్

కక్ష్య సాధింపు చర్యలు సరికాదు..


వైరాలో మాట్లాడుతున్న బాలగంగాధర్ తిలక్


మధిర: సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మధిర/ వైరా/ కల్లూరు/ వేంసూరు/ ఎర్రుపాలెం/ ఏన్కూరు/ తల్లాడ: రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుందని మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణగుప్తా, పెండ్ర అంజయ్య, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, గోళ్ల అప్పారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, టీపీసీసీ వైరా మండల ప్రోగ్రామింగ్ ఇన్‌చార్జ్ బాలగంగాధర్ తిలక్, పీసీసీ సభ్యుడు వడ్డె నారాయణరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా కాంగ్రెస్ నాయకుడు బానోత్ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్, ఖమ్మం కార్పొరేటర్ వెంకటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు బైరెడ్డి మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం మధిరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, వైరా మండల కాంగ్రెస్ కార్యాలయంలో, కల్లూరులోని ఎంపీటీసీ కొండూరు కిరణ్‌కుమార్ గృహంలో, వేంసూరు అడసర్లపాడు, ఎర్రుపాలెంలో పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశాల్లో, కొణిజర్లలోని పెద్దగోపతిలో, ఏన్కూరులో, తల్లాడలో జరిగిన కార్యకర్తల సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీ ఎప్పుడైతే పార్లమెంట్‌లో మోదీ అక్రమాలను ప్రశ్నించడం మొదలు పెట్టారో అప్పటి నుంచి బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజల సొమ్ము దోపిడి గురించి రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక భయాందోళనలకు గురై నియంత తరహాలో అణిచివేసే ప్రయత్నం మొదలు పెట్టారన్నారు. దీనిని ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయని తెలిపారు. బీజేపీ తప్పుడు కేసులు వెనక్కి తీసుకోవాలన్నారు. జోడో యాత్రతో రాహుల్ గాంధీకి వస్తున్న ఆదరణను చూసి బీజేపీ ప్రభుత్వం ఓర్వలేకపోతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమాలల్లో రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ కొండూరు కిరణ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన దుర్గాప్రసాద్, నాయకులు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మాదిరాజు లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ గోపాలస్వామి, పుల్లారావు, తల్లాడ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నరేంద్ర, రంగా, కృష్ణ, చోటో, అఫ్రోజ్, భాస్కర్‌రావు, చుక్కా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ప్రేమలత బుచ్చాలు, ఎస్సీ సెల్ సురేష్, యూత్ నిజయోజకవర్గం కార్యదర్శి మధు, నాయకులు వేణు, వసంతరావు, నాయకులు దారా బాలరాజు, బాణావత్ వెంకటరమణ నాయక్, షేక్ జహంగీర్, తూమాటి నవీన్ రెడ్డి, అద్దంకి రవికుమార్, కర్నాటి రామారావు, దుంపా వెంకటేశ్వర రెడ్డి, నిడమానూరు వంశీ, బిట్ర ఉద్దండయ్య, అనుమోలు కృష్ణారావు, బండారు నర్సింహారావు, శ్రీనివాసరావు, బూసిపల్లి వెంకటరెడ్డి, జానీబాషా, యన్నం పిచ్చిరెడ్డి, మోహన్‌రావు, బాబురావు, శ్రీను, బోసు, వెంకటనర్సయ్య, కొండ, కాంగ్రెస్ నాయకుడు బాలాజీ, టీపీసీసీ సభ్యుడు రాందాస్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పాదిల హరినాథ్, దొడ్డ పుల్లయ్య, పమ్మి అశోక్, ఆనందరావు, వెంకటేశ్వరరావు, గంగారావు, శ్రీను, కిరణ్, హన్మంతరావు, యేసు, అమ్మపాలెం ఎంపీటీసీ రమాదేవి, అనూష, సర్పంచ్‌లు, టీపీసీసీ సభ్యుడు రాందాస్ నాయక్, స్వర్ణ నరేందర్, కృష్ణప్రసాద్, నర్సింహారావు, అయోధ్య, సత్యనారాయణ, నర్సింహారావు, కాపా సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘుపతిరెడ్డి, కిరణ్, కృష్ణారావు, వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


కల్లూరు: మాట్లాడుతున్న దగ్గుల రఘుపతిరెడ్డి